పాలమూరులో నూతన సందడి



జిల్లాకేంద్రంలోని ఓ బేకరీలో కేకుల కొనుగోలు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరులో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. వేడుకల్లో కేక్ కటింగ్‌లకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తున్న జనం వాటిని కొనుగోలు చేయడం కోసం పట్టణంలోని బేకరీల వద్ద బారులు తీరారు. బేకరీల నిర్వాహకులు సైతం వివిధ డిజైన్లతో కేక్‌లను తయారు చేసి అందించడంలో నిమగ్నమయ్యారు. ఖోవా బటర్, బాదం ఫ్లెక్స్, రోస్టెడ్ ఆల్‌మోంట్, అంజీర్ విత్ క్యాషోనెట్స్, చాకో ఖోవా, హనీ ఆల్‌మోండ్, హనీ డ్రైఫ్రూట్ ఫ్రెష్ ఫ్రూట్, డ్రైఫ్రూట్, వెనిలాకేక్, బెల్జియం చాక్లెట్, బ్లాక్‌ఫ్రూట్ వెనిలా క్యారమిల్ చాక్లెట్, చాక్లెట్ న్యూట్రెల్లాతో పాటు థీమ్ కేక్‌లు, ప్లమ్ కేక్, డ్రైఫ్రూట్ ప్లమ్, మఫిన్స్ కేక్‌లతోపాటు శాఖహారుల కోసం ఎగ్‌లెస్ కేక్‌లు అందుబాటు ఉంచారు. జిల్లా కేంద్రంలోని 70కుపైగా బేకరీల్లో న్యూఇయర్ వేడుకలకు దాదాపు 60వేల నుంచి 70వేలకు పైగా కేక్‌లను అందుబాటులో ఉంచడం గమనార్హం. కాగా కిలో కేకు రూ.200నుంచి రూ.300వరకు విక్రయించారు. కూల్ కేకు రూ.500నుంచి రూ.1000వరకు తీసుకుంటున్నారు. పట్టణంలో కొన్ని రెస్టారెంట్‌ల నిర్వాహకులు ఒక బిర్యానీతో పాటు మరో బిర్యానీ, కేకులు, కూల్‌డ్రింక్స్ ఉచితంగా ఇచ్చి ఆకర్షించే ప్రయత్నం చేశారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

చిన్నచింతకుంట: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆదివారం చిన్నచింతకుంటలో సామాజిక సేవకుడు ఎస్ శేఖర్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేక్‌ను కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. మండల కోఆప్షన్‌మెంబర్ మహిమూద్, బండి బషీర్, హరీష్, శాంసన్, గుండన్న, కృపాకర్, సోలమాన్, సాగర్, దినకర్ పాల్గొన్నారు.







రెడ్‌క్రాస్ సేవలు వెలకట్టలేనివి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు వెలకట్టలేని వని పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక ఎనుగొండలోని అనాథ బాల, బాలికల ఆవాస వసతి గృహం (సన్నిధి) లో చిన్నారులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన అభాగ్యులను ఈ సన్నిధి అక్కున చేర్చుకుని వారి భవిష్యత్ కోసం పునాదులు వేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి పండ్లు, కేక్, బెడ్‌షీట్లను చిన్నారులకు అందించారు. అంతకుముందు అక్కడి తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. వారు తయారు చేసిన వస్తువులను చూసి అభినందించారు. సన్నిధి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు లయన్ నటరాజ్, సభ్యులు డా.విష్ణుజనార్దన్, డా.శామ్యూల్, జగపతిరావు, డా.ఫరీద్ పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: పట్టణంలో సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజలు అట్టహాసంగా 2024కు స్వాగతం పలికారు. మున్సిపాలిటి పరిధిలోని ముఖ్యకూడళ్ల, కేంద్రాల్లో పెద్ద ఎత్తున కేక్‌ల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాలనీల్లో డీజేలు ఏర్పాటు చేసుకుని యువత నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టారు. స్థానిక యంబీ బేథని చర్చి, సెంటినరి, పెంథకోస్ట్ చర్చిల్లో రాత్రి 12గంటల వరకు ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ హాస్టళ్లు, కంపెనీల్లోనూ ఆదివారం రాత్రి ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. పట్టణంలోని అన్ని మద్యం దుకాణాల్లోనూ రద్దీ నెలకొంది. పెద్ద ఎత్తున విక్రయాలు జరిగినట్లు తెలిసింది. అలాగే మాంసం, చికెన్ విక్రయ దుకాణాలు కిటకిటలాడాయి.



రెడ్‌క్రాస్ సన్నిధిలో చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



చిన్నచింతకుంటలో దుస్తుల పంపిణీ



జిల్లాకేంద్రంలో సంబురాలు



జిల్లా కేంద్రంలో డ్రంకెన్ డ్రైవ్

స్థలాన్ని స్వాధీనం చేసుకుని రోడ్డు వేయిస్తాం



మహబూబ్‌నగర్ రూరల్: ధర్మాపూర్‌లో కబ్జాకు గురైన స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకుని గ్రామస్తుల ప్రయోజనార్థం వినియోగిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. గ్రామంలో శ్రీ పోచమ్మదేవి ఆలయం చుట్టూ ఉన్న గ్రామకంఠం స్థలం కొన్నాళ్ల క్రితం కబ్జాకు గురైంది. గ్రామానికి చెందిన వ్యక్తి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. దాంతో ఆలయం సందర్శనకు కూడా సంకట పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్తులు జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యేకు వివరించగా ఆయన స్పందించి వెంటనే స్వాధీనం చేసుకుని ఆలయం చుట్టూ సీసీరోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు. పెద్ద చెన్నయ్య, పెద్ద రాములు, యాదయ్య, శ్రీను, తిరుమల కృష్ణయ్య ఉన్నారు.

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. త్వరలో మహబూబ్‌నగర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన ఉంటుందన్నారు. సీఎంతో మాట్లాడి అధిక నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎన్‌పీ వెంకటేశ్, జహీర్ అఖ్తర్, షాఫైసల్, అజ్మత్‌అలీ, అవేజ్, సిద్దిక్, అలీం, జహీర్ పాల్గొన్నారు. వీరన్నపేటలో ఎమ్మెల్యేను పలువురు ఘనంగా సన్మానం చేశారు. యెన్నం మాట్లాడుతూ వీరన్నపేటలోని డంపింగ్‌యార్డును పట్టణానికి దూరంగా తరలిస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ మక్బూల్, సాదుల్లా, ఖలీల్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రహెమానియా రిఫాయి దర్గాలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. దేవరకద్రలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం ఏర్పాటు చేయగా 65 మంది చెక్కులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఆరుగ్యారంటీలను ప్రజలకు అందించడానికి ప్రజాపాలనలో దరఖాస్తులను తీసుకుంటున్నారని తెలిపారు. 100 రోజుల్లో ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, నాయకులు అరవింద్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, అంజన్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హన్మంతురెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జవహర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులు రావడానికి చర్యలు తీసుకుంటాం

దేవరకద్ర బస్టాండ్‌లోకి బస్సులు రాకపోకలు సాగించడానికి ఆర్టీసీ అధికారులతో మాట్లాడతామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం దేవరకద్ర ఆర్వోబీ నుంచి వచ్చే బస్సులు యూటర్న్ తీసుకోడానికి కావలసిన స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా ఎమ్మెల్యే మండల నాయకులు, వ్యాపారులతో మాట్లాడారు. ఆర్వోబీకి రెండు వైపులా సర్వీసు రోడ్లను కూడా వేయిస్తామని తెలిపారు.

ఎట్టకేలకు ‘వరుస’ మొదలెట్టారు



సాక్షి ఎఫెక్ట్..

అడ్డాకుల: మండలం మీదుగా పోతున్న 44వ నంబర్ జాతీయ రహదారిపై ఎట్టకేలకు తెలుపు రంగు వరుసలను ఏర్పాటు చేయిస్తున్నారు. రెండు, మూడు నెలల నుంచి రహదారిపై అడ్డాకుల, మూసాపేట, భూత్పూర్ మండలాల్లో పాత రోడ్డుపై బీటీ రెన్యూవల్ చేయిస్తున్నారు. భూత్పూర్ మండలం పోతులమడుగు నుంచి శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద కర్నూల్, హైదరాబాద్ రెండు రోడ్లపై బీటీ రెన్యూవల్ పూర్తి చేశారు. పోతులమడుగు నుంచి జడ్చర్ల, టోల్‌ప్లాజా నుంచి కొత్తకోట వరకు బీటీ పనులు చేయించాల్సి ఉంది. అయితే కొత్తగా వేసిన బీటీ రోడ్డుపై తెలుపు రంగు వరుసలు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. దీనిపై ఈనెల 25న ‘రహదారిపై వరుస గుర్తులేవీ’ శీర్షికన ‘సాక్షి’ దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన రహదారి నిర్వాహకులు రెండు, మూడు రోజులుగా పోతులమడుగు నుంచి టోల్‌ప్లాజా వైపు తెలుపు రంగు వరుసలను ఏర్పాటు చేయిస్తున్నారు. అయితే రహదారిపై డివైడర్ పక్కన మొదట ఒకే లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పాటే మధ్యలైన్, బాడర్ లైన్‌ను ఏర్పాటు చేయిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు. రహదారి నిర్వాహకులు ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరముందని చెబుతున్నారు.

జూనియర్ కళాశాలల్లో 3 నుంచి మధ్యాహ్న భోజనం

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటన

జడ్చర్ల టౌన్: నియోజకవర్గంలోని 5 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన జన్మదినం పురస్కరించుకుని నిర్ణయాన్ని ప్రకటించారు. జడ్చర్ల, మిడ్జిల్, బాలానగర్, నవాబుపేటల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని 1300మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించనున్నట్లు వివరించారు. తన జన్మదినం రోజునే భోజనాన్ని అందించాలనుకున్నప్పటికీ ఆదివారం సెలవుదినం, సోమవారం జనవరి 1 సెలవు ఉండటంతో జనవరి 3 నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రెండు నెలల పాటు భోజనాన్ని అందించి విద్యార్థులకు సౌకర్యం కలిప్పించనున్నారు. ఎమ్మెల్యే ప్రకటనతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



రాజాపూర్/మిడ్జిల్/బాలానగర్/నవాబుపేట: జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం రాజాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరహరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నాయకులు గిరిగౌడ్, గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, వనపర్తి కృష్ణయ్య, లింగం, విక్రమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
మిడ్జిల్ బస్టాండ్ నిర్వహించిన వేడుకల్లో నాయకులు రబ్బాని, సాయిలు, మల్లికార్జున్ రెడ్డి, గౌస్, నర్సిములు, పర్వతాలు, చంద్రమౌళి, లక్ష్మారెడ్డి, సత్యం, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.
బాలానగర్ మండల కేంద్రంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు హతిరాం నాయక్, వెంకట్ నాయక్, లింబ్యానాయక్, భాస్కర్ గౌడ్ లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.
నవాబుపేట మండల కేంద్రంతో పాటు కారుకొండ, కొల్లూర్ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, అంజనేయులు, జలాలోద్దిన్ బాబర్, ఖాజా, వెంకటేష్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, వాసుయాదవ్ తదితరులు ఉన్నారు. కారుకొండలో 156 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. భూపాల్‌రెడ్డి, రమేష్, వెంకటేష్, లింగం, మల్లేష్ ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థులు



నవాబుపేట: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థులు అముల్యా, రాధిక ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. వారు 3 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. మేరకు విద్యార్థులను ఆదివారం అభినందించారు.

కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్ నుంచి

జడ్చర్ల: హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు కోడ్గల్ జెడ్పీహెచ్ఎస్ నుంచి విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ శంకర్‌నాయక్ తెలిపారు. బాలికల విభాగంలో నందిని, సరిత, శ్రీవాణి, కృష్ణవేణి, సంధ్య, బాలుర విభాగంలో సక్కురాం, శ్రీను, పవన్, ప్రశాంత్, చరణ్, సురేష్, విజయ్‌లు ఎంపికై నట్లు వివరించారు. వీరు మహబూబ్‌నగర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

భూమాతను, గోమాతను నిర్లక్ష్యం చేస్తే అనర్థాలే



మహబూబ్‌నగర్ రూరల్: భూమాతను, గోమాతను నిర్లక్ష్యం చేస్తున్న కారణంగానే అనేక అనర్థాలు జరుగుతున్నాయని తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల ఆర్‌ఎస్ఎస్ సమన్వయ కర్త ఆకుతోట రామారావు అన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గల కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జరిగిన ప్రకృతి రైతుల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గో సంరక్షణ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణతో పాటు నేలతల్లి సారవంతమవుతుందని అన్నారు. గ్రామ భారతి జిల్లా అధ్యక్షుడు అమరవాది రాజనరసింహ, గో సేవా ప్రముఖ్ ముకుందరెడ్డి, ప్రచార కార్యదర్శి గుముడాల చక్రవర్తిగౌడ్, బస్వరాజ్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా పడిపూజ

నవాబుపేట: యన్మన్‌గండ్ల సమీపంలోని అయ్యప్ప కొండపై సోమవారం మహా పడిపూజ నిర్వహించనున్నారు. మండల అయ్యప్ప సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఏటా నూతన సంవత్సరం రోజు కార్యక్రమ నిర్వహణ ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆలయ పీఠాధిపతి వెంకటేష్ గురుస్వామి, జంగయ్య గురుస్వాముల ఆధ్వర్యంలో కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సమితి బృందం వెంకటేష్ , జంగయ్య, రవి, బ్రహ్మం, సుధర్శన్, యాదయ్య, సునిల్, శ్రీను, రాము, శివ, నర్సింహ, వెంకట్ తదితరులు కోరారు.

ఇసుక మఫియాకు సహకరిస్తే చర్యలు



మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట ప్రభుత్వం ఇసుక మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట వేసే ప్రయత్నాలను ఆచరణలో పెట్టింది. ఆదివారం అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్ కేసిరెడ్డి దేవేందర్, గిర్దావర్ నర్సింగ్‌లు ఎర్రవల్లి తండాను సందర్శించి ఫిల్టర్ ఇసుక తయారీ కోసం భూమిని లీజుకిచ్చిన రైతులకు తీవ్రంగా హెచ్చరికలు జారీ చేశారు. ఇలాంటి వాటికి భూములను లీజుకిస్తే సహించబోమని హెచ్చరించారు. అవసరమైతే నిర్దాక్షిణ్యంగా పట్టాలను బ్లాక్ లిస్టులో పెట్టి రైతుబంధు రాకుండా చూస్తామని, అలాంటి చర్యలకు పూనుకున్న వారు మానుకోవాలని హెచ్చరించారు.

మన్ కీ బాత్ వీక్షించిన నాయకులు

పాలమూరు: ప్రధాని నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని టీడీ గుట్టలోని బీజేపీ కార్యకర్త శివకుమార్ నివాసంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ వీక్షించారు. ఆమెతోపాటు నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హరినామ సంకీర్తనలో అమిస్తాపూర్ వాసులు

భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ శ్రీ ఆంజనేయ స్వామి భజన మండలి సభ్యులు ఆదివారం తిరుమలలో అఖండ హరినామ సంకీర్తనలో పాల్గొన్నారు. కోరి వీరన్న, ఆర్తి నారాయణ, ప్రభులింగం, నారాయణ గౌడ్, కంకలి లింగం తదితరులు ఉన్నారు.



తిరుమలలో స్వామివారి సంకీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు